# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/







## రైతు గోస పట్టదా?

రైతుల ఇబ్బందులు పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

ఎక్కడ చూసినా ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి

'రైతుగోస-- బీజేపీ భరోసా'లో రాంచందర్‌రావు



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి రైతుల గోస పట్టడం లేదని, పండించిన పంటను అమ్ముకోలేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్లలో సోమవారం 'రైతుగోస-- బీజేపీ భరోసా'కార్యక్రమాన్ని ప్రారంభించి, మార్కెట్ యార్డులోని రైతులతో మాట్లాడారు. ఆ తర్వాత సిద్దిపేట జిల్లా గజ్వేల్ మార్కెట్ యార్డును కూడా సందర్శించి రైతులతో మాట్లాడారు. వరంగల్‌లో ఇచ్చిన డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ఏనాడో మర్చిపోయిందన్నారు. రియల్‌ఎస్టేట్ దందా తప్ప క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఎలా జరుగుతుందో సీఎంకు తెలియదన్నారు. ఇప్పటివరకు ఆయా జిల్లాల వారీగా ఎంతమేర ధాన్యం సేకరించారో శ్వేతపత్రం విడుదల చేయాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.45 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సి

## హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట..

# రూ.13,600 కోట్ల రుణాల రీఫైనాన్స్!

ఐఆర్ఎఫ్‌సీతో రూ.13,600 కోట్ల భారీ డీల్

20 ఏళ్ల పాటు చెల్లింపుల వెసులుబాటు

ప్రభుత్వానికే మెట్రో 100 శాతం వాటా

నగరంలో మరింత పెరగనున్న మెట్రో విస్తరణ

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చేలా కీలక ఒప్పందం కుదిరింది. రూ.13,600 కోట్ల రుణాలను రీఫైనాన్స్ చేయడానికి ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ ముందుకు వచ్చింది. ఈ మేరకు ఢిల్లీలో ఇరు సంస్థల ఉన్నతాధికారులు అధికారికంగా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

**20 ఏళ్ల పాటు ఊరట**

ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ మనోజ్‌కుమార్ దూబె, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సమక్షంలో ఈ డీల్ ఖరారైంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం రాబోయే 20 ఏళ్ల కాలపరిమితితో, ప్రతి మూడు నెలలకు ఒకసారి





## రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

సీపీఎం నేతలతో జరిగిన భేటీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సీపీఎం నాయకులతో సమావేశంలో సీఎం వ్యాఖ్యలు

కనీస వేతనాల సవరణ చట్టంపై సీఎంకు ధన్యవాదాలు తెలిపిన సీపీఎం బృందం

## పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం...

ప్రకాశం జిల్లా జనసేన కార్యవర్గం మొత్తం రద్దు

ప్రకాశం జిల్లా జనసేన కమిటీని రద్దు చేసిన పవన్

వర్గ విభేదాలు, క్రమశిక్షణారాహిత్యమే కారణమని వెల్లడి

25 మంది సభ్యుల మధ్య 54 గొడవలు ఉన్నాయని వ్యాఖ్య

ఇకపై పార్టీలో కఠినంగా వ్యవహరిస్తానని స్పష్టం




## మళ్లీ పెరిగిన ఇంధన ధరలు

ఆగని పెట్రో బాదుడు..

పెట్రోల్‌పై లీటరుకు రూ. 2.61,

డీజిల్‌పై రూ.2.71 చొప్పున పెంపు

11 రోజుల్లో నాలుగోసారి వడ్డన

మొత్తంగా రూ.7.5 పెరిగిన ధర


కేంద్ర ప్రభుత్వంపై విపక్షాల ఫైర్

న్యూఢిల్లీ, మే 25 : ఎన్నికల ముందు ఇంధన ధరలు పెంచబోమని పదేపదే ప్రకటించిన కేంద్రం.. ఎన్నికలు ముగిశాక వరుసగా ధరలు పెంచుకుంటూ పోతున్నది. తాజాగా మరోసారి ఇంధన ధరలను పెంచింది. పెట్రోల్‌పై లీటర్‌కు రూ. 2.61, డీజిల్‌పై లీటర్‌కు రూ. 2.71 చొప్పున సోమవారం ధరలు పెరిగాయి. తాజా పెంపుతో మే 15 నుంచి లీటర్‌కు మొత్తం పెంపు రూ.7.5కు చేరింది. గడచిన 11 రోజుల్లో ఇంధన ధరలు పెరుగడం ఇది నాలుగోసారి. ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 99.51 నుంచి రూ. 102.12 చేరుకోగా లీటర్ డీజిల్ ధర రూ. 92.49



న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ నుంచి పద్మశ్రీ పురస్కారాలు స్వీకరిస్తున్న తెలంగాణకు చెందిన ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి దీపికారెడ్డి. వరుసగా యూజీసీ మాజీ చైర్మన్ మామిడాల జగదీశ్, ప్రముఖ ఆంకాలజిస్ట్ విజయ్ ఆనంద్ రెడ్డి, ప్రముఖ వైద్యులు జీ వెంకట్ రావు.

## చిప్ నుంచి షిప్ వరకు...
## ఏపీని జెట్ స్పీడ్ తో అభివృద్ధి చేస్తాం



టెక్నాలజీతో ఏపీని వేగంగా ముందుకు తీసుకెళతామన్న సీఎం చంద్రబాబు

- అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు నిర్ణయం
- 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని వెల్లడి
- చిప్ నుంచి షిప్ వరకు తయారీపై దృష్టి సారించామని స్పష్టం

టెక్నాలజీని అనుసంధానం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను జెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మెటా, అమెజాన్, జోహో వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుందని,








జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

# ఒక్కటైనా కట్టారా?

(మొదటి పేజీ తరువాయి)

కూకట్‌పల్లి (హైదరాబాద్): అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా..హైదరాబాద్ నగరానికి కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పరిపాలన గురించి అవగాహన ఉంది కాబట్టే నగర ప్రజలు ఒక్క సీటు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన అనేక ఫ్లై ఓవర్లు మొదలుకుని టిమ్స్ ఆసుపత్రి దాకా ప్రతి ఒక్కటీ తామే నిర్మించామని, ప్రస్తుతం వాటికే సీఎం రేవంత్‌రెడ్డి రిబ్బన్ కట్ చేస్తూ తామే నిర్మించామని చెప్పుకుంటున్నారని ధ్వజమెత్తారు. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నగరానికి ఒక్కటంటే ఒక్క రూపాయి కూడా అదనంగా ఖర్చు చేయలేని అసమర్థ ప్రభుత్వం అని మండిపడ్డారు. రెండున్నర సంవత్సరాల్లో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా నిర్మించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించినట్టు నిరూపించినా రాజకీయ సన్యాసం చేస్తానని సవాల్ విసిరారు. సోమవారం కూకట్‌పల్లిలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.

**కాంగ్రెస్ మోసం చేసింది..**

'బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం అభివృద్ధి పైనే దృష్టి పెట్టాం. తెలంగాణకు 24 గంటల కరెంటు, తాగునీటిని అందించింది కేసీఆరే. కానీ అసెంబ్లీ ఎన్నిలప్పుడు అడ్డగోలుగా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రతి వర్గాన్ని మోసం చేసింది. ప్రభుత్వ విధానాలతో హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ పూర్తిగా దెబ్బతింది. లక్షలాది మంది భవన నిర్మాణ కార్మికులకు, సెంట్రింగ్ కార్మికులకు ఉపాధి లభించకుండా పోయింది. బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ, సెంట్రింగ్ కార్మికుల కోసం బీమాతో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తాం. నగరంలో ప్రతి ఇంటికీ 24 గంటలు తాగునీటిని సరఫరా చేస్తాం. ఈ బాధ్యత నేనే తీసుకుంటా..'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# గొడ్డలి పార్టీకి గత ఎన్నికల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పారు



(మొదటి పేజీ తరువాయి)

గత జగన్ ప్రభుత్వం కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలను వేధించి, రాష్ట్ర అభివృద్ధిని పాతాళానికి తొక్కేసిందని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం చీపుర్లపాడులో రూ.10.51 కోట్లతో నిర్మించనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అధికారంలో ఉండగా 'నాకెంత.. నీకెంత' అంటూ దోచుకున్న ఆ 'గొడ్డలి పార్టీ'కి గత ఎన్నికల్లో ప్రజలే సరైన బుద్ధి చెప్పారని, రాబోయే రోజుల్లో ఆ పార్టీ శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని జోస్యం చెప్పారు.గత ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ భూములను ఆక్రమించుకోవాలని చూస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి రూ.15 వేల కోట్లు మంజూరు చేయించి ఉక్కు పరిశ్రమను కాపాడారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ నాయకత్వంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో కేవలం 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించామని, యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే తమ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు.శ్రీకాకుళం జిల్లాలో వలసలను అరికట్టేందుకు పరిశ్రమల స్థాపన అవసరమన్న ఆయన... నియోజకవర్గ తాగునీటి సమస్యకు రూ.620 కోట్లు మంజూరు చేశామన్నారు. జిల్లా ప్రజల 60 ఏళ్ల కల అయిన 'నేరడి బ్యారేజీ'ని 2029 నాటికి వంద శాతం పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# వడదెబ్బతో 49 మంది మృతి

**(మొదటి పేజీ తరువాయి)**రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో వడదెబ్బకు గురయ్యే వారి సంఖ్యా పెరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం వేర్వేరు ప్రాంతాల్లో వడదెబ్బతో 49 మంది చనిపోయారు. వరంగల్ జిల్లా బుధరావుపేటలో గుండ్రపల్లి సదయ్య (58), ధర్మారంలో అంకేశ్వరపు సమ్మక్క (70), దమ్మన్నపేటలో అనసూర్య (68), ఖిలా వరంగల్ పడమరకోటలో బొల్లం వీరమల్లు (68), మొండ్రాయిలో తండ చేరాలు (75), పుల్లయబోడులో భూక్య నరేశ్ (29), సర్వాపురానికి చెందిన మండల వీరయ్య (74) వడదెబ్బతో మృతిచెందారు. పరకాల డిపోనకు చెందిన కండక్టర్ బి.శంకర్ (48) విధుల్లో భాగంగా భద్రాచలం నుంచి పరకాల బయలుదేరి కొత్తగూడెం దాటిన తర్వాత అనిశెట్టిపల్లి వద్ద వేడిగాలితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆర్టీసీ డ్రైవర్, ప్రయాణికులు కొత్తగూడెం ఆస్పత్రికి తరలిస్తుండగానే ప్రాణం కోల్పోయాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని నగరంపల్లిలో గొర్రెలకాపరి కోడారి సాంబయ్య(52), అంకుషాపూర్‌లో వ్యవసాయ కూలీ మహమ్మద్ సైద్‌ఖాన్ (42), జనగామ జిల్లా రంగరాయగూడెంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో అదే గ్రామానికి చెందిన రైతు నెలమంచ ఎలేందర్‌రెడ్డి (39) ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురై చనిపోయాడు. శివునిపల్లికి చెందిన పిట్టల శంకర్--రవళి దంపతుల కుమారుడు అక్షిత్ (4) ఎండ తీవ్రతతో మృతి చెందాడు. ఘన్‌పూర్‌లో తాటికొండ నర్సమ్మ(65), కామారపు విజయ్ (60), వరంగల్ జిల్లా ఇటుకాలపల్లిలో కూలీ నైనబోయిన రాజు(44) హనుమకొండ జిల్లా నీరుకుళ్లలో మేస్త్రీ వద్ద పనిచేసే కూలీ వడదెబ్బతో చనిపోయాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పెయింటర్ కొమిరె రమేశ్ (39), బైపాస్‌రోడ్డులో ఉండే యాచకుడు షేక్ లతీఫ్ (50), ములుగుకు చెందిన బీజేపీ నేత అన్నపురెడ్డి ప్రమోద్‌రెడ్డి (49), కమలాపురంలో అన్నపు రెడ్డి లక్ష్మీబాయి (80), తిరువాయిపేట వెంకటరమణ (48), తాడి సత్యవతి (80) వడదెబ్బతో చనిపోయారు.

# మళ్లీ పెరిగిన ఇంధన ధరలు

నుంచి రూ. 95.20కి పెరిగింది. ఇంధన ధరలు 2022 మే తర్వాత ఇంత అత్యధిక స్థాయికి చేరుకోవడం ఇదే మొదటిసారి. హొర్ముజ్ జలసంధిని తిరిగి తెరువడానికి అమెరికా, ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిన తర్వాత ప్రపంచ చమురు ధరలకు ప్రాథమిక ప్రమాణమైన బెరట్ క్రూడ్ 5 శాతానికి పైగా పడిపోయింది. ఇరాన్ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు, అలాగే కీలకమైన ప్రపంచ చమురు రవాణా మార్గమైన హొర్ముజ్ జలసంధి గుండా నౌకాయానానికి అంతరాయం కలుగడంతో ఫిబ్రవరి నెలాఖరు నుంచి ప్రపంచ ముడి చమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి గృహోపయోగ వంటగ్యాస్ ధరను 14.2 కిలోల సిలిండర్ రూ. 60, కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్(సీఎన్జీ) ధరను మే మధ్య నుండి కిలోకు రూ. 4 చొప్పున పెంచారు.

పెట్రోల్, డీజిల్ ధరల తాజా పెంపుపై ప్రతిపక్షాలు ప్రభుత్వంపై సోమవారం దాడిని కొనసాగించాయి. అంతర్జాతీయ ముడి చమురు ధరలు నిలకడగా ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. ఇంధన ధరలను పదేపదే పెంచడం ద్వారా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇంధన లూటీని కొనసాగిస్తున్నదని ఆయన ఆరోపించారు. సామాన్య ప్రజల పొదుపు మొత్తాలను దగ్ధం చేసేందుకు మోదీ ప్రభుత్వం పెట్రోల్ చల్లిందని ఖర్గే వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వ హయాంలో అంతర్జాతీయ ముడి చమురు ధరలు ఒక్క డాలరు కూడా పెరుగలేదని ఆయన చెప్పారు. అయినప్పటికీ మోదీ ప్రభుత్వం 2014లో రూ. 71.41 ఉన్న లీటర్ పెట్రోల్ ధరను 2026 నాటికి రూ. 102.71కి పెంచిందని ఖర్గే చెప్పారు. అదే విధంగా లీటర్ డీజిల్ ధరను రూ. 56.71 నుంచి రూ. 95.20కి చేర్చిందని చెప్పారు. రష్యా, ఇరాన్ నుంచి తక్కువ ధరలకు ముడి చమురును ఎందుకు భారత్ కొనుగోలు చేయడం లేదని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రశ్నించారు.

**పీఎన్జీ ఉంటే ఎల్పీజీ బంద్**

పైప్‌డ్ నేచురల్ గ్యాస్(పీఎన్జీ) వినియోగదారులు ఇకపై ఎల్పీజీ సిలిండర్లను కొనుగోలు చేయకూడదని భారత ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం తలెత్తడంతో, ప్రభుత్వం కొన్ని పరిశ్రమలకు ఎల్పీజీ సరఫరాను ఇప్పటికే నిలిపివేసింది.

మే 15న లీటర్‌కు రూ.3 చొప్పున తొలిసారిగా రిటైల్ ఇంధన ధరలను పెంచగా ఆ తర్వాత మే 19న 90 పైసలు, మే 23న పెట్రోల్ ధరలు 87 పైసలు, డీజిల్ ధరలు 91 పైసలు లీటర్‌కు పెరిగాయి. స్థానిక పన్నుల కారణంగా రాష్ట్రాలవారీగా ధరలు మారుతూ ఉంటాయి. సోమవారం పెంపు తర్వాత ముంబైలో పెట్రోల్ ధర లీటర్‌కు రూ. 111.21, డీజిల్ ధర రూ. 97.83గా ఉండగా, కోల్‌కతాలో ధరలు వరుసగా రూ. 113.51, రూ. 99.82కి పెరిగాయి. చెన్నైలో పెట్రోల్ ధర లీటర్‌కు రూ. 107.77, డీజిల్ ధర లీటర్‌కు రూ. 99.55గా ఉంది.

# హైదరాబాద్ మెట్రోకు భారీ ఊరట.. రూ.13,600 కోట్ల రుణాల రీఫైనాన్స్!

ఈ రుణాన్ని చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. దీనివల్ల హైదరాబాద్ మెట్రోపై ఉన్న తక్షణ ఆర్థిక భారం తగ్గనుంది.

**ప్రభుత్వానికే 100 శాతం వాటా**

ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు కీలక విషయాన్ని వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టులో 100 శాతం యాజమాన్య వాటా పూర్తిగా ప్రభుత్వానికే బదిలీ అయినట్లు స్పష్టం చేశారు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

**కనెక్టివిటీ పెంచడమే లక్ష్యం**

దేశ ఆర్థిక వృద్ధిలో హైదరాబాద్ నగరం కీలక ఇంజిన్‌లా మారుతోందని సీఎస్ పేర్కొన్నారు. మెట్రో రైలు కనెక్టివిటీని మరింత విస్తరించడం ద్వారా నగరంలో ట్రాఫిక్ రద్దీ చాలావరకు తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రీఫైనాన్స్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ, ఎల్‌అండ్‌టీ, హెచ్ఎంఆర్ఎల్ బృందాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# చిప్ నుంచి షిప్ వరకు... ఏపీని జెట్ స్పీడ్ తో అభివృద్ధి చేస్తాం

యువతకు అపార అవకాశాలు సృష్టిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. సోమవారం విజయవాడలో జరిగిన 'ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్తు నాలెడ్జ్ ఎకానమీపై ఆధారపడి ఉందని, దీన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అమరావతిని 'క్వాంటం వ్యాలీ'గా మారుస్తామని, క్వాంటం కంప్యూటింగ్ పరికరాల ఉత్పత్తిని కూడా ఇక్కడే చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. యువత, విద్యాసంస్థలు ఈ నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం విధానాలు రూపొందిస్తుందని తెలిపారు. రాష్ట్రాన్ని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తున్నామని, విశాఖపట్నాన్ని ప్రపంచానికే డేటా సెంటర్‌గా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు వివరించారు. స్టీల్, అల్యూమినియం, రేర్ ఎర్త్ మినరల్స్ వంటి కీలక పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. పుట్టపర్తి నుంచి బెంగళూరు వరకు డిఫెన్స్ కారిడార్‌గా, రాయలసీమను రూ.40 వేల కోట్ల పెట్టుబడితో ఉద్యాన హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఐదో తరం ఫైటర్ జెట్ యుద్ధ విమానాల టెస్టింగ్ ఫెసిలిటీని రాయలసీమలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. సూర్యలంక, గండికోట వంటి పర్యాటక ప్రాంతాలను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దుతామన్నారు. ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన 'చిప్ టు షిప్' పిలుపునకు అనుగుణంగా రాష్ట్రంలో మాన్యుఫ్యాక్చరింగ్‌పై దృష్టి సారించామని సీఎం తెలిపారు. కేవలం ఒప్పందాలు చేసుకోవడమే కాకుండా, పరిశ్రమలు వాస్తవ రూపంలో కార్యకలాపాలు ప్రారంభించేలా చూస్తున్నామని, 'సైనింగ్, గ్రౌండింగ్, ఓపెనింగ్' తమ ప్రభుత్వ విధానమని పునరుద్ఘాటించారు. గత 23 నెలల్లో నెలకు రూ.లక్ష కోట్ల చొప్పున మొత్తం రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామని ఆయన వెల్లడించారు. ఎంఎస్ఎంఈ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చంద్రబాబు తెలిపారు.

# రైతు గోస పట్టదా?

ఉండగా, ఇప్పటివరకు కేవలం 45 లక్షల టన్నులు సేకరించామని సీఎం పేర్కొంటున్నారని తెలిపారు. ఈ లెక్కన కూడా 30 శాతం మించలేదని మండిపడ్డారు.బీజేపీ శాసనసభాపక్షనేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి కాకుండానే, వారంలో కేంద్రాలను మూసేయాలని ప్రభుత్వం భావిస్తున్నదని మండిపడ్డారు. అలా చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ బీజేపీ బస్సు యాత్ర వస్తుందని తెలిసి...కలెక్టర్ ఆదివారం గజ్వేల్ మార్కెట్ యార్డుకు ఆగమేఘాల మీద చేరుకొని లారీలు , గన్నీ బ్యాగులు తెప్పించే ప్రయత్నం చేశారని చెప్పారు. ఇదే ప్రయత్నం నిరంతరంగా ఎందుకు సాగటం లేదని ప్రశ్నించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలనకు ఐక్యతను చాటుతూ ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు బస్సులో బయలుదేరారు. ఈ బస్సు యాత్రలో ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎం.రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, రామారావు పటేల్, పైడి రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యానారాయణగుప్తా, డా.పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీలు ఏవీఎన్‌రెడ్డి, డా.సి.చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్య, పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

# రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం

హైదరాబాద్: రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్రం మద్దతు ధరలు ప్రకటిస్తున్నప్పటికీ పంటలను మాత్రం పూర్తిస్థాయిలో కొనడం లేదని అన్నారు. సోమవారం సచివాలయంలో సీపీఎం రాష్ట్ర నాయకులు.. ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ నేతృత్వంలో ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పండిన పంటలో 30 శాతం కూడా సేకరించడం లేదని విమర్శించారు. పంట కొనుగోళ్ల విషయంలో కేంద్రాన్ని ప్రశ్నించాలని వారికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు కొనసాగిస్తోందన్నారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తూ కొనుగోలు చేస్తున్నామని, మొక్కజొన్నను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. కొనుగోళ్లపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తున్నామని సీఎం చెప్పారు. బెంగాల్ ఎన్నికల కారణంగా హమాలీల కొరత ఏర్పడిందని, ఎండ తీవ్రత వల్ల మధ్యాహ్న సమయంలో పనులు మందగిస్తున్నాయని పేర్కొన్నారు. మూసీ నిర్వాసితులకు అక్కడే ఇళ్లు..: కాగా, మూసీ నిర్వాసితులకు స్థానికంగానే ఇళ్లు మంజూరు చేస్తామని సీపీఎం నేతలకు సీఎం హామీ ఇచ్చారు. మూసీ అంశంపై బీఆర్ఎస్, బీజేపీ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. మూసీని అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని, ఈ ప్రాజెక్ట్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

# పవన్ కల్యాణ్ సంచలన నిర్ణయం...

(మొదటి పేజీ తరువాయి)

జనసేన పార్టీలో తన పుష్కర కాలం నాటి సహనానికి స్వస్తి పలుకుతున్నానని, ఇకపై పార్టీలో క్రమశిక్షణ తప్పితే ఉపేక్షించేది లేదని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. పార్టీని ఒక సైనిక పటాలంలా ముందుకు నడిపించేందుకు కఠిన నిర్ణయాలు తప్పవని స్పష్టం చేశారు. రాజమండ్రిలో జరిగిన పార్లమెంటరీ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీలో ప్రక్షాళనకు శ్రీకారం చుడుతున్నట్లు సంచలన ప్రకటన చేశారు. దీనికి తొలి అడుగుగా, అంతర్గత కలహాలతో సతమతమవుతున్న ప్రకాశం జిల్లా జనసేన కార్యవర్గాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రకాశం జిల్లా కమిటీలో



తీవ్రమైన వర్గ విభేదాలు ఉన్నాయని, కేవలం 25 మంది సభ్యుల మధ్య ఏకంగా 54 గొడవలు ఉన్నాయని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్గత కలహాలతో ఒకరినొకరు పనిచేయనివ్వకుండా పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని మండిపడ్డారు. పార్టీలో ఇలాంటి క్రమశిక్షణారాహిత్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు పార్టీలో అందరికీ స్వేచ్ఛ ఇచ్చానని, కానీ ఇకపై తాను అనుకున్న పద్ధతిలోనే పార్టీని ముందుకు నడిపిస్తానని తేల్చిచెప్పారు. "ఒకే మార్గంలో నడవండి, లేదంటే పక్కకు తప్పుకోండి (ఫాల్ ఇన్ లైన్ ఆర్ ఫాల్ అవుట్ ఆఫ్ లైన్)" అంటూ గట్టిగా హెచ్చరించారు. ఈ నిర్ణయం ద్వారా పార్టీలో ఏ స్థాయి నేతలైనా క్రమశిక్షణ తప్పితే కఠిన చర్యలు తప్పవనే బలమైన సందేశాన్ని పవన్ పంపించారు. త్వరలోనే ప్రకాశం జిల్లాకు కొత్త కార్యవర్గాన్ని నియమించనున్నట్లు సమాచారం.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## మహిళా సాధికారత దిశగా ముందడుగు

**- మొల్లగూడెంలో రూ.10 లక్షలతో మహిళా భవనానికి శంకుస్థాపన**

**- పాల్గొన్న అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు**

**తొలివెలుగు, రాజాపేట :**గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి స్వయం సహాయక సంఘాలు కీలక భూమిక పోషిస్తున్నాయని, వారి కార్యకలాపాల నిర్వహణకు ప్రత్యేక భవనాలు ఎంతో అవసరమని పలువురు అభిప్రాయపడ్డారు. రాజాపేట మండలంలోని మొల్లగూడెం గ్రామంలో మహిళా సహకార సంఘం భవన నిర్మాణానికి సోమవారం ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. ఈ భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల నిధులను మంజూరు చేసింది. గ్రామంలో మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, పొదుపు, రుణాల లావాదేవీల నిర్వహణకు ఇప్పటి వరకు సరైన వసతి లేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో నూతన భవనం నిర్మాణం మహిళలకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. ఆదివారం ఉదయం గ్రామ సర్పంచ్ జెన్నపల్లి బాలరాజు రెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ అల్లం ఇన్నారెడ్డి వేదమంత్రోచ్ఛారణల మధ్య భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాలరాజు రెడ్డి మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపునకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మంజూరైన నిధులతో నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి మహిళా సంఘాల వినియోగానికి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు హాజరై మహిళా సంఘాల సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళల అభ్యున్నతికి ఈ భవనం కేంద్రంగా మారి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రెడ్డబోయిన కవిత, మండల పార్టీ అధ్యక్షులు, మండల పరిషత్, రెవెన్యూ శాఖల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా ఉచిత వైద్యం!

**- చల్లూరులో ఘనంగా టీబీ స్క్రీనింగ్ క్యాంప్**

**- ఇంటి ముంగిటకే వైద్యాన్ని తెచ్చిన ప్రజాపాలన**

**- హాజరైన మండల వైద్యాధికారి మోసెస్ రాజ్**

**- 136 మందికి క్షయ స్క్రీనింగ్ పరీక్షలు**



**తొలివెలుగు, రాజాపేట:** గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైద్య శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని చల్లూరు గ్రామ సర్పంచ్ భీమగాని రూప బాలనర్సయ్య కోరారు. 'టీబీ ముక్త్ భారత్ అభియాన్', 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం చల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉచిత క్షయ (టీబీ) వ్యాధి నిర్ధారణ, సాధారణ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ రూప రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, నిరుపేదలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా ఇటువంటి హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో నిర్వహించిన ఈ శిబిరంలో కేవలం క్షయ పరీక్షలే కాకుండా బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించిన ప్రాథమిక తనిఖీలు చేసి, బాధితులకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. గ్రామస్తులు వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా, ఇంటి ముంగిటకే లభిస్తున్న ఈ సేవలను అందిపుచ్చుకోవాలని ఆమె సూచించారు. వైద్యుల బృందం గ్రామంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. శిబిరానికి వచ్చిన వారిలో అనుమానితులైన 136 మందికి టీబీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అందులో అత్యధికంగా 96 మందికి అత్యాధునిక పరికరాలతో డిజిటల్ ఛాతి ఎక్స్‌రేలు తీసి తదుపరి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. క్షయ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని వైద్యులు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ మోసెస్ రాజ్, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ భీకు నాయక్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రేమలత, హెల్త్ అసిస్టెంట్ మాధవి, జిల్లా టీబీ సూపర్‌వైజర్ జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ నటేష్, ఎక్స్‌రే టెక్నీషియన్ ఉమేష్, స్థానిక ఆశా కార్యకర్తలు, గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

**- నమిల సర్పంచ్ పులి రాజు పిలుపు**

**- అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా పోషకాహార దినోత్సవం**

**- ఆహార పదార్థాల తయారీపై ప్రత్యేక అవగాహన**



**తొలివెలుగు, రాజాపేట :**గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల ఆరోగ్య పరిరక్షణకు పోషకాహారం ఎంతో అవసరమని నమిల గ్రామ సర్పంచ్ పులి రాజు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల పరిధిలోని నమిల-1 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లులు, గర్భిణులకు పోషకాహారంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ పులి రాజు మాట్లాడుతూ.. సమాజంలో పోషకాహార లోపాన్ని నిర్మూలించేందుకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అనేక రకాల పౌష్టికాహార పదార్థాలను అందిస్తోందన్నారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు, అంగన్‌వాడీల్లో ఇచ్చే గుడ్లు, పాలు, బాలామృతాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తల్లులు ఆరోగ్యంగా ఉంటేనే పుట్టే బిడ్డలు దృఢంగా ఉంటారని ఆయన పేర్కొన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో లభించే వస్తువులతోనే తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించేలా రుచికరమైన వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. గర్భిణులకు, తల్లులకు ఏయే ఆహార పదార్థాల్లో ఎలాంటి విటమిన్లు, ప్రొటీన్లు ఉంటాయో అంగన్‌వాడీ సిబ్బంది వండి చూపిస్తూ వివరించారు. చిన్నారుల బరువు, ఎత్తులను క్రమ పద్ధతిలో నమోదు చేయాలని సర్పంచ్ సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గిరెడ్డి పద్మ, స్థానిక ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులోకి రానున్న 'ఉపాధి' రోడ్డు

**- ధర్మారంలో మట్టి రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మందుల సామేలు**

**- సొంత గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతా: శాసనసభ్యుడు.. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయొద్దు**





**తొలివెలుగు, అడ్డగూడూరు:**మండల పరిధిలోని ధర్మారం గ్రామ రైతులకు సాగు భూములకు వెళ్లేందుకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచే దిశగా అడుగులు పడ్డాయి. గ్రామంలోని గంగ దేవమ్మ గుడి నుంచి మూసి వాగు వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నూతనంగా నిర్మించ తలపెట్టిన మట్టి రోడ్డు (బీట్ రోడ్డు) పనులను సోమవారం తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు లాంఛనంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ మేకల మేరి ఆనంద్, ఉప సర్పంచ్ కత్తుల నరేష్‌లతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మందుల సామేలు మాట్లాడుతూ.. ధర్మారం తన సొంత గ్రామమని, పుట్టిన ఊరి రుణం తీర్చుకునేందుకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. గతంలో మూసి వాగుపై చెక్ డ్యాములు లేకపోవడం వల్ల రైతులు సాగునీరు అందక తీవ్రంగా నష్టపోయేవారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన చెక్ డ్యాముల కారణంగా భూగర్భ జలాలు పెరిగి, ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతులు రికార్డు స్థాయిలో పంట దిగుబడులు సాధించడం సంతోషకరమన్నారు. కేంద్రంలో మన్మోహన్ సింగ్, ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పేదలకు వలసలు నివారించేందుకు ఉపాధి హామీ పథకాన్ని తెచ్చారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయితే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ పథకం పేరు మార్చి, పని దినాలను 100 రోజుల నుంచి 70 రోజులకు కుదించి నిర్వీర్యం చేయడానికి చూస్తోందని మండిపడ్డారు. ఉపాధి హామీని పాత పద్ధతిలోనే కొనసాగిస్తూ పని దినాలను 150 రోజులకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, వార్డు సభ్యులు, కూలీలు పాల్గొన్నారు.



## గాలివాన బీభత్సం.. కూలిన ఇల్లు!

**- శివన్నగూడలో నిరాశ్రయులైన పేద కుటుంబం**

**- తప్పిన పెద్ద ప్రమాదం..**

**ఆందోళనలో లక్ష్మణ్ కుటుంబం**

**- ప్రభుత్వ సాయం కోసం బాధితుల ఆవేదన**



**తొలివెలుగు, చౌటుప్పల్:**నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల పరిధిలోని శివన్నగూడ గ్రామంలో సోమవారం సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులు, అకాల వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. గాలివాన బీభత్సానికి గ్రామానికి చెందిన లక్ష్మణ్ (స్వర్గీయ రాములు కుమారుడు) నివాసముంటున్న ఇల్లు పూర్తిగా కూలిపోవడంతో కుటుంబం నిరాశ్రయులైంది. ఇల్లు కూలుతున్న సమయంలో కుటుంబ సభ్యులు అప్రమత్తమై వెంటనే బయటకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇంట్లోని గృహోపకరణాలు, ధాన్యం, బట్టలు, నిత్యావసర వస్తువులు శిథిలాల కింద పడి పూర్తిగా ధ్వంసమయ్యాయి.

బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి బలమైన ఈదురుగాలులు వీచాయి. గాలుల తీవ్రతను తట్టుకోలేక పాత ఇల్లు క్షణాల్లో కుప్పకూలిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు సర్వస్వం కోల్పోయి తలదాచుకునేందుకు కూడా చోటు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని గ్రామస్థులు కోరారు.

సర్వస్వం కోల్పోయిన లక్ష్మణ్ కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించడంతో పాటు ఉచిత రేషన్, నిత్యావసర వస్తువులు అందించాలని, శాశ్వత నివాసం కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కుటుంబ సభ్యులు బంధువుల ఇంట్లో ఆశ్రయం పొందుతున్నట్లు తెలిసింది.

## భూదాన్ పోచంపల్లిలో 'కమ్యూనిటీ హెల్త్ సెంటర్' ఏర్పాటు చేయాలి

**- స్పీకర్ గడ్డం ప్రసాద్ కు మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ల వినతి**

**- కలుషిత మూసీ, పరిశ్రమలతో పెరిగిన రోగాల బారిన ప్రజలు**

**- 30 పడకల ఆసుపత్రి మంజూరు చేయాలని విన్నపం**

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** ప్రపంచ ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రమైన భూదాన్ పోచంపల్లి పట్టణంలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) ని ఏర్పాటు చేయాలని కోరుతూ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కు వినతిపత్రం సమర్పించారు. సోమవారం హైదరాబాద్ లోని స్పీకర్ అధికారిక కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కౌన్సిలర్లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఇక్కడి ప్రజల వైద్య అవసరాలను వివరించారు.

ఈ సందర్భంగా చైర్మన్ తడక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పోచంపల్లి మున్సిపాలిటీ, మండల పరిధిలో స్థానిక జనాభాతో పాటు ఉత్తరప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన దాదాపు 25 వేల మందికి పైగా వలస కూలీలు ఇక్కడే నివాసం ఉంటున్నారని తెలిపారు. మొత్తంగా 60 వేల మందికి పైగా జనాభా ఉన్న ఈ ప్రాంతంలో సరైన ప్రభుత్వ వైద్య సదుపాయాలు లేక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు, కలుషిత మూసీ నది ప్రవాహం, రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న వాయు కాలుష్యం కారణంగా స్థానికులు నిత్యం తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఇక్కడ 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను మంజూరు చేయాలని వారు స్పీకర్‌ను కోరారు. దీనిపై స్పీకర్ సానుకూలంగా స్పందించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు సూరపల్లి రాధికా రమేష్, కొండమడుగు ఎల్లస్వామి, రావుల జంగయ్య, దేవరాయ కుమార్, జింకల లావణ్య యాదగిరి, కాంగ్రెస్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ గుత్తి బాలశంకర్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళల ఆర్థిక బలోపేతానికే పెద్దపీట

**- ధర్మారెడ్డిపల్లి, కాప్రాయపల్లిలో మహిళా భవనాలకు భూమిపూజ**

**- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి: సర్పంచ్ సామ రవీందర్ రెడ్డి**

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థిక పరిపుష్టి సాధించాలని ధర్మారెడ్డిపల్లి సర్పంచ్ సామ రవీందర్ రెడ్డి, ప్రముఖ నాయకులు రాగీరు నర్మద సత్యనారాయణ ఆకాంక్షించారు. మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లి, కాప్రాయపల్లి గ్రామాలలో మహిళా సంఘ భవనాల నిర్మాణానికి సోమవారం వారు ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ఈ భవనాలు ఎంతో దోహదపడతాయని, మహిళలంతా వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురివి వెంకటేష్ గౌడ్, సీసీ వసంత, ఉప సర్పంచ్ కొమరి కిరణ్, మాజీ ఉపసర్పంచ్ సురవి కాటంరాజు, సుంకరి రవి, సంఘ బంధం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

# రైతులకు ఇబ్బంది రానివ్వం: ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

- అంకిరెడ్డిగూడెంలో 12వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాము కేటాయింపు
- పది రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేస్తాం: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- దిగుబడి పెరగడం, హమాలీల కొరత వల్లే కొనుగోళ్లలో కొంత జాప్యం
- రైతులకు బహిరంగంగా క్షమాపణలు చెప్పిన మునుగోడు ఎమ్మెల్యే





**తొలివెలుగు, చౌటుప్పల్ :**రైతులు పండించిన వరి ధాన్యాన్ని వర్షాల ముప్పు నుంచి కాపాడేందుకు, నిల్వ సమస్యను అధిగమించేందుకు మునుగోడు నియోజకవర్గంలో ప్రైవేటు గోదాములను కేటాయిస్తున్నట్లు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలో రైతుల ధాన్యం నిల్వ నిమిత్తం నూతనంగా కేటాయించిన 12 వేల మెట్రిక్ టన్నుల (సుమారు 3 లక్షల బ్యాగులు) సామర్థ్యం గల ప్రైవేటు గోదామును సోమవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. లక్షా యాభై వేల క్వింటాళ్ల సామర్థ్యం ఉన్న ఈ ప్రైవేటు గోదామును రైతుల అవసరాల కోసం తీసుకున్నామని వెల్లడించారు. వచ్చే పది రోజుల్లో జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోళ్ల వేగవంతంపై ఎప్పటికప్పుడు ప్రభుత్వ పెద్దలతో, ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నట్లు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి చౌటుప్పల్ మండలంలో రెండు రెట్లు, నారాయణపురం మండలంలో నాలుగు రెట్లు అదనంగా ధాన్యం దిగుబడి పెరిగిందన్నారు. దిగుబడి ఊహించని విధంగా పెరగడం, దీనికి తోడు హమాలీల కొరత ఏర్పడటం, కొందరు మిల్లర్ల ఉదాసీన వైఖరి వల్ల ధాన్యం సేకరణలో కొంత ఆలస్యమైన మాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు. ఈ జాప్యానికి ప్రభుత్వం తరఫున రైతులకు క్షమాపణలు చెబుతున్నానని హుందాగా ప్రకటించారు. రాత్రింబవళ్లు కష్టపడి అన్నదాతలకు అండగా నిలవాలనే సంకల్పంతోనే ఈ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, రైతులు అధైర్యపడొద్దని కోరారు. ఎక్కువ నిల్వ సామర్థ్యం ఉన్న మరికొన్ని ప్రైవేటు గోదాములను సైతం ప్రభుత్వ పరంగా మాట్లాడి తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.



## ధాన్యం దిగుమతుల్లో జాప్యం వద్దు

- మిల్లుల్లో పెంచాల్సిన హమాలీల సంఖ్య
- జూన్ మొదటి వారానికల్లా కొనుగోళ్లు పూర్తి కావాలి
- పెద్దరావులపల్లి 'సోమేశ్వర' మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :**రైస్ మిల్లులకు తరలించిన ధాన్యం దిగుమతి ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మిల్లుల యాజమాన్యాలను ఆదేశించారు. మండల పరిధిలోని పెద్దరావులపల్లి గ్రామంలో ఉన్న సోమేశ్వర రైస్ మిల్లును సోమవారం ఆయన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకారెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లు ఆవరణలో నిలిచిన ధాన్యం లారీల వివరాలను, దిగుమతి అవుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. మిల్లుల్లో హమాలీల కొరత రాకుండా చూసుకోవాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకుని వచ్చిన వాహనాన్ని వచ్చినట్లే దిగుమతి చేసుకోవాలని సూచించారు. జూన్ మొదటి వారానికల్లా జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యంగా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు.ఈ తనిఖీల్లో జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్ఓ) రోజారమణి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, డి.బాలమణి, ఆర్ఐ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపురంలో పైప్‌లైన్ పనుల ప్రారంభం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో నిధుల మంజూరు
- గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాం: సర్పంచ్ ఎమ్మా శిరీష
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



**తొలివెలుగు, రాజాపేట :**దమండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి గ్రామీణ నీటి సరఫరా నిధులతో నూతన పైప్‌లైన్ పనులను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఆలేరు నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రత్యేక సహకారంతో ఈ నిధులు మంజూరయ్యాయి. గ్రామ సర్పంచ్ ఎమ్మా శిరీష నాగరాజ్ ఈ పనులకు కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా పనులను ప్రారంభించారు. గ్రామంలో అంతర్గత నీటి సరఫరాను మెరుగుపరిచేందుకు గాను రెండు ప్రధాన మార్గాలలో ఈ పైప్‌లైన్ పనులను చేపట్టారు. పాత దుర్గమ్మ గుడి నుండి కొత్త దుర్గమ్మ గుడి వరకు ఒక మార్గం, అలాగే డంపింగ్ యార్డ్ నుండి పెద్దమ్మ గుడి వరకు రెండో మార్గంలో నూతన పైపులను వేసే పనులను ముమ్మరం చేశారు. దీనివల్ల రాబోయే రోజుల్లో గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు తొలిగిపోనున్నాయని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. నర్సాపురం గ్రామ అభివృద్ధికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నిరంతరం సహకరిస్తున్నారని కొనియాడారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు తమ పాలకవర్గం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. నర్సాపురం గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పనులకు సహకరిస్తున్న ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దండే లక్ష్మణ్, ఉప సర్పంచ్ నారపాక కరుణాకర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

- నమిల గ్రామంలో బాధితుడికి నగదు అందజేత
- పేదలకు అండగా ఫౌండేషన్ సేవలు: సర్పంచ్ పులి రాజు

**తొలివెలుగు, రాజాపేట :**నిరుపేద కుటుంబాలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా బీర్ల ఫౌండేషన్ సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తోందని నమిల గ్రామ సర్పంచ్ పులి రాజు అన్నారు. రాజాపేట మండల పరిధిలోని నమిల గ్రామానికి చెందిన పోచంగల్ల కృష్ణ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విషయాన్ని గ్రహించిన ఫౌండేషన్ నిర్వాహకులు, సోమవారం అతనికి ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. గ్రామ సర్పంచ్ పులి రాజు, స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబానికి రూ. 3,000 నగదును స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పులి రాజు మాట్లాడుతూ.. సమాజంలో ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో బీర్ల ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని కొనియాడారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నేతృత్వంలో నడుస్తున్న ఈ ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది పేద కుటుంబాలకు వైద్య, విద్యా, తక్షణ ఆర్థిక సహాయం అందుతోందని గుర్తు చేశారు. తమ గ్రామానికి చెందిన కృష్ణ కుటుంబ పరిస్థితిని వివరించిన వెంటనే స్పందించి ఈ సాయం అందించడం అభినందనీయమన్నారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచిన బీర్ల ఫౌండేషన్ చైర్మన్‌కు, సర్పంచ్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, వార్డు సభ్యులు మల్లేశం, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## పింఛనుదారులు జీవన ప్రమాణ ధ్రువీకరణ ప్రక్రియలో పాల్గొనండి

**తొలివెలుగు, బాలాపూర్ :** పింఛనుదారులు ఈనెల 29 నుండి వచ్చే నెల ఒకటి వరకు వార్డు కార్యాలయంలో నిర్వహించే జీవన ప్రమాణ ధ్రువీకరణ కార్యక్రమంలో పాల్గొని ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మున్సిపల్ అధికారులు తెలిపారు. బడంగ్పేట్ సర్కిల్ 16 పరిధిలోని పూర్వపు బడంగ్పేట్ మున్సిపాలిటీ అల్మాస్గూడ కు చెందినవారు అల్మాస్గూడ వార్డు కార్యాలయం, నాదర్గుల్ మరియు కురుమలగూడ కు చెందిన వారు నాదర్గుల్ వార్డు కార్యాలయంలో, గుర్రంగూడా కు చెందినవారు గుర్రంగూడా వార్డు కార్యాలయం, బడంగ్పేట్ చెందినవారు ఎమ్మార్వో కార్యాలయ సమీపంలోని కమ్యూనిటీ హాల్, బాలాపూర్ కు చెందినవారు బాలాపూర్ వార్డు కార్యాలయం, మల్లాపూర్ మరియు వెంకటాపూర్ కు చెందినవారు మల్లాపూర్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జీవన ప్రమాణ ధ్రువీకరణ కార్యక్రమానికి ఆధార్ కార్డుతో పాటు ఇతర సంబంధిత పత్రాలతో హాజరుకావాలని తెలిపారు.

# విద్యను వ్యాపారంగా మారిస్తే ఊరుకోం!

- రాష్ట్రంలో విద్య సామాన్యుడికి భారంగా మారింది
- ప్రైవేటు ఫీజుల నియంత్రణపై విద్యాశాఖ నిద్ర వీడాలి
- కలెక్టర్లు, డీఈఓలు రంగంలోకి దిగాలి: బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్





**తొలివెలుగు, చౌటుప్పల్/హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఇష్టారాజ్యంగా పెంచేస్తున్న అధిక ఫీజుల సమస్యను అరికట్టాలని, ఇందుకోసం విద్యాశాఖ అధికారులు, జిల్లా కలెక్టర్లు తక్షణమే జోక్యం చేసుకోవాలని బీసీవై పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకత్వం డిమాండ్ చేసింది. పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఆదేశాల మేరకు.. రాష్ట్రంలో విద్యాసంస్థల ఫీజుల దోపిడీ, తల్లిదండ్రుల ఆర్థిక ఇబ్బందులపై పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ.. విద్య అనేది ప్రతి విద్యార్థి ప్రాథమిక హక్కు అని, కానీ కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు లాభాపేక్షతో విద్యను పూర్తి వ్యాపారంగా మార్చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, విద్యాశాఖ మార్గదర్శకాలను సదరు సంస్థలు తుంగలో తొక్కుతున్నా పాలకులు పట్టించుకోకపోవడం వల్లే సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు అప్పులపాలు అవుతున్నాయని విమర్శించారు. విద్య అనేది కేవలం ధనికులకు మాత్రమే కాకుండా, ప్రతి పేద బిడ్డకూ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

### ప్రత్యేక కమిటీలతో తనిఖీలు చేపట్టాలి: డా. చిలకల శ్రీనివాస్ యాదవ్

బీసీవై పార్టీ పీఏసీ సభ్యుడు డాక్టర్ చిలకల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. అడ్మిషన్లు, బిల్డింగ్, బస్సులు, పుస్తకాల పేరుతో ప్రైవేట్ సంస్థలు అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో డీఈఓ, ఎంఈఓ మరియు ఇంటర్ విద్యాశాఖ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజుల కోసం విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేయడం, పరీక్షలకు కూర్చోనివ్వకపోవడం, సర్టిఫికెట్లు ఆపేయడం వంటి చర్యలను వెంటనే నిలిపివేయాలన్నారు. ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత, సరైన వేతనాలు కల్పించాలని, ఆర్టీఈ చట్టం ప్రకారం పేదలకు దక్కాల్సిన 25 శాతం ఉచిత సీట్లను పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. తల్లిదండ్రుల ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ తీసుకురావాలని, లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రుల పక్షాన రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

# రసాయన శాస్త్రంలో రమేష్ గౌరకు పీహెచ్.డీ పట్టా

- పారుపల్లి గ్రామానికి చెందిన పరిశోధకుడికి అత్యున్నత డాక్టరేట్ పట్టా
- ఔషధ తయారీ రంగంలో సరికొత్త సంశ్లేషణ పద్ధతులపై పరిశోధన
- యాదాద్రి భువనగిరి జిల్లాకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు
- గీతం విద్యాసంస్థల ప్రతినిధుల ప్రశంసలు



**తొలివెలుగు, రాజాపేట:**యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం పారుపల్లి గ్రామానికి చెందిన పరిశోధక విద్యార్థి రమేష్ గౌర రసాయన శాస్త్రంలో అత్యున్నత డాక్టరేట్ (పీహెచ్.డీ.) పట్టాకు అర్హత సాధించారు. హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగానికి చెందిన ఆయన.. ప్రముఖ ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్ర బాబు మార్గదర్శకత్వంలో తన పరిశోధనలను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మేరకు గీతం వర్సిటీ వర్గాలు ఇటీవల అధికారిక ప్రకటన విడుదల చేశాయి. రమేష్ గౌర స్థానిక గ్రామానికి చెందిన గౌర బక్కయ్య, కమల దంపతుల కుమారుడు.

### ఔషధ రంగానికి మేలు చేకూర్చే పరిశోధన

రమేష్ గౌర 'మెథిమజోల్, లెవోడోపా, మిటాపివాట్ సల్ఫేట్, వారెనిక్లిన్ టార్ట్రేట్ వంటి క్రియాశీల ఔషధ పదార్థాల (ఏపీఐ) వినూత్న సంశ్లేషణ పద్ధతుల అభివృద్ధి' అనే సంక్లిష్టమైన అంశంపై అంతర్జాతీయ ప్రమాణాలతో పరిశోధన సాగించి సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ముఖ్యమైన ఫార్మాస్యూటికల్ సమ్మేళనాల తయారీలో అత్యంత సమర్థవంతమైన, సురక్షితమైన, ఆర్థికంగా లాభదాయకమైన సరికొత్త మార్గాలను ఆయన కనుగొన్నారు. నాలుగు కీలక ఏపీఐల (యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్) కోసం ఆయన అభివృద్ధి చేసిన నూతన ప్రక్రియలు దిగుబడి పెంపునకు, మలినాల నియంత్రణకు, ప్రక్రియ భద్రతకు, పారిశ్రామిక సాధ్యతను గణనీయంగా మెరుగుపరచడానికి ఎంతగానో దోహదపడతాయని గైడ్ ప్రొఫెసర్ ఎం.ఎస్. సురేంద్ర బాబు పేర్కొన్నారు. అధునాతన విశ్లేషణ పద్ధతుల మద్దతుతో సాగిన ఈ పరిశోధన, ఔషధ తయారీ రంగానికి ఆచరణాత్మక పరిష్కారాలను అందిస్తూ, ప్రాసెస్ కెమిస్ట్రీలో కీలక పురోగతికి బాటలు వేస్తుందని తెలిపారు.

### వర్సిటీ వర్గాల అభినందనలు

?రమేష్ గౌర సాధించిన ఈ అత్యున్నత విజయానికి గాను గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం తదితరులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

### స్వగ్రామంలో మిన్నంటిన సంబరాలు

రమేష్ గౌరకు పీహెచ్.డీ పట్టా దక్కడంపై పారుపల్లి గ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు మిఠాయిలు పంచి సంతోషం వ్యక్తం చేశారు. రాజాపేట మండల జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు ఉప్పల రమేష్ ఈ సందర్భంగా రమేష్ గౌరను ప్రత్యేకంగా అభినందించారు. రమేష్ గౌర చేసిన అంతర్జాతీయ స్థాయి పరిశోధనలతో పారుపల్లి గ్రామానికే కాకుండా రాజాపేట మండలానికి, యాదాద్రి భువనగిరి జిల్లాకు రాష్ట్ర, దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభించిందని వారు కొనియాడారు.

# గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

- బక్రీద్ సందర్భంగా గోవుల కుర్బానీ వద్దు.. హిందువుల మనోభావాలను గౌరవిద్దాం
- మునుగోడు నియోజకవర్గ మైనార్టీ సంఘం కోఆర్డినేటర్ అబ్దుల్ రజాక్

**తొలివెలుగు, మర్రిగూడ :** గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని, మునుగోడు నియోజకవర్గ మైనార్టీ సంఘం కోఆర్డినేటర్ అబ్దుల్ రజాక్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. భారతదేశంలో గోవును కోట్లాది మంది హిందువులు పవిత్రంగా భావిస్తారు. మత సామరస్యాన్ని కాపాడేందుకు, హిందువుల మనోభావాలను గౌరవిస్తూ, బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను కుర్బానీ ఇవ్వకూడదని, ముస్లిం మత పెద్దలు తీసుకున్న నిర్ణయం అభినందనీయమని పేర్కొన్నారు. దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలంటే, అన్ని మతాల ప్రజలు ఒకరి మనోభావాలను మరొకరు గౌరవించుకోవాలన్నారు. ఈ మేరకు ముస్లిం పెద్దలు ముందడుగు వేయడం హర్షించదగ్గ విషయమని, వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలని అబ్దుల్ రజాక్ అన్నారు.గో సంరక్షణ కేవలం ఒక మతానికి సంబంధించిన అంశం కాదని, భారతీయ సంస్కృతి, వ్యవసాయ రంగానికి గోవు వెన్నెముక అని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే గోవును జాతీయ జంతువుగా ప్రకటించి చట్టపరమైన రక్షణ కల్పించాలని కేంద్రాన్ని కోరారు.

